19వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
ఆదివారం 16 ఫిబ్రవరి 2025 పేజీలు : 8

## ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 15 :** జిల్లాలో ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇసుక రవాణాపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్ ల నుంచి మాత్రమే తరలించాలని, వే బిల్, డ్రైవర్ కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమతి లేని వాగుల నుంచి ఇసుక తరలించకుండా నిఘా పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాలకు ఇసుక అవసరం ఉంటుందని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు పెట్టాలని, ఆయా చోట్ల ఇసుక అక్రమంగా తరలించకుండా కందకాలు తవ్వించాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధాభాయ్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా ప్రకారమే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

- విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లకు మూడు వేర్వేరు బిల్లులను పెట్టాలి
- కుల సర్వే పూర్తి స్థాయి నివేదికను అసెంబ్లీలో పెట్టాలి
- డెడికేటెట్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలి
- ఖమ్మంలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత




**చురకలు విలేఖరి,ఖమ్మం: ఫిబ్రవరి, 15 :** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తామనడం దారుణమని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.శనివారం నాడు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46 శాతం ఉన్నారని, రీ సర్వే చేయడంతో మరో 1.5 లేదా 2 శాతం బీసీల జనాభా పెరుగుతుందని తెలిపారు. అంటే మొత్తం బీసీల జనాభా దాదాపు 48 శాతం ఉంటుందని అంచనా వేశారు. 48 శాతం బీసీలు ఉంటే... ఏ ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారు ? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఈ మూడు రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే న్యాయపరమైన చిక్కులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏ ఒక్క అంశంపై అయినా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం బిల్లు చెల్లకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మూడు రంగాలకు సంబంధించి వేర్వేరు బిల్లులను పెట్టాలని డిమాండ్ చేశారు. ముస్లింలు, బీసీలకు కలిపి మొత్తం 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. రిజర్వేషన్ల విషయంలో హిందువులు, ముస్లింలకు మధ్య బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ముస్లింల జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్లు కల్పించాలని, ముస్లింల పేరు చెప్పి ఆయా వర్గాల మధ్య పంచాయతీ పెట్టవద్దని సూచించారు.గ్రామాల వారీగా ఏ కులంలో ఎంత జనాభా ఉందో ప్రభుత్వం బయటపెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఇప్పటి వరకు ప్రభుత్వం బయపెట్టలేదని, దాన్ని కూడా వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా లెక్కలు సరైనవా కావా అన్నది ప్రజలు తెల్చుకోగలుగుతారని తెలిపారు. సర్వే లో పాల్గొని వారికి మరోసారి అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, రీ సర్వేకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలని , టోల్ ఫ్రీ నెంబరులో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ బీసీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని, అందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ పదవుల్లో బీసీలకు 51 శాతం అవకాశాలు కల్పిస్తున్నదని గుర్తు చేశారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే ద్వారా తేలిన జనాభా ప్రకారం నిధులు ఖర్చు చేసుకున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ ఉంటే అభివృద్ధిలో భారత్ ఎప్పుడో అమెరికాను దాటిపోయేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి సంస్థ బీసీలకు న్యాయం కోసం పోరాటం చేస్తుందని, సామాజిక దృక్పథంతో పనిచేస్తున్న సంస్థ తెలంగాణ జాగృతి అని చెప్పారు. జాగృతి పోరాటాల వల్లనే అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, బతుకమ్మ పండగకు రాష్ట్ర హెూదా సాధ్యమయ్యిందని గుర్తు చేశారు.అక్రమ కేసులకు తలొగ్గేదే లేదు.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం.ఏ కారణం లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నార బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు.ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు

2లో

## దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- 30 వ్యవసాయ మోటర్లు, ఒ బైక్, 30 కిలోల కాపర్ వైర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల /మెట్ పల్లి, ఫిబ్రవరి 15 :** తాళాలు వేసిన ఉన్న ఇండ్లను, బైక్ లు, వ్యవసాయ మోటర్లను దొంగతనం చేస్తున్న ముగ్గురు దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం మెట్పల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాళాలు వేసిన ఉన్న ఇండ్లను, బైక్ లు, వ్యవసాయ మోటర్లను దొంగతనం చేస్తున్న నిందితులను పట్టుకోవడానికి మెట్పల్లి డిఎస్పీ రాములు ఆధ్వర్యంలో, మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సిసి పుటేజీలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను శనివారం ఇబ్రహీంపట్నం ఎక్స్ రోడ్డు వద్ద ఎస్ఐ అనిల్ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానితులను పట్టుకొని విచారించగా వారు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిందితులు ఏ1 కుంచెపు వెంకటేష్. ఏ2 సూర్యవంశీ సాయికుమార్. ఏ3 అబ్దుల్ బారీ ముగ్గురు కలిసి ఒ ముఠాగా

2లో

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

## నరేందర్ రెడ్డికే పట్టం గట్టాలి

- పట్టభద్రులకు మానకొండూర్ ఎమ్మెల్యే పిలుపు



**చురకలు విలేఖరి ,తిమ్మాపూర్ ఫిబ్రవరి 15 :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డికే అఖండ మెజార్టీతో గెలిపించాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీశ్రేణులకు, పట్టభద్రులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని లక్ష్మినర్సింహ కన్వెన్షన్ లో పట్టభద్రుల దశ-దిశ పేరిట నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పరిచయం అక్కర లేని వ్యక్తి అని, కష్టపడి ఎదిగిన ఆయన విద్యారంగానికి అందించిన సేవలు శ్లాఘనీయన్నారు. విద్యాసంస్థలను స్థాపించిన నరేదంర్ రెడ్డి పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడమే కాకుండా తమ సంస్థల్లో 5వేల మంది నిరుద్యోగుల కు ఉద్యోగ, ఉపాధి

2లో

## పీఏసీఎస్‌ల పదవీ కాలం పొడగింపు పట్ల సింగిల్ విండో పాలకవర్గం హర్షం

**-సీఎంకు ధన్యవాదాలు తెలిపిన చైర్మన్ రమణ రెడ్డి**



**చురకలు విలేఖరి చిగురుమామిడి :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో 6నెలలు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల చిగురుమామిడి సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ పాలక వర్గాల పదవీ కాలం పొడగింపుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, మరియు ఇట్టి నిర్ణయానికి ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిల్ల శ్రీధర్ బాబు కు చిగురుమామిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

## తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చిన ఘనత కేసీఆర్ ది

**-మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** తండాలను గ్రామపంచాయితీలుగా మార్చిన ఘనత మాజీ సీఎం కేసిఆర్ ని జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం ధర్మానాయక్ తండాలో జరిగిన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ హింస పాపమని, మత్తు, ధూమపానం శాపమని హితవు పలికిఅందరికీ ఆదర్శపురుషు డయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేలు రాజు, మాజీ సర్పంచ్ సంతోష్, సిలివేరి మదన్, అండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, గంగారెడ్డి, వెంకటేష్, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



**మొదటి పేజీ తరువాయి...** ఏర్పడ్డారని, నిందితులైన వెంకటేష్,సాయికుమార్లు ట్రాక్టర్ డ్రైవర్లకు పని చేస్తుండే వారని, అబ్దుల్ బారీ స్క్రాప్ దుకాణం నడిపే వాడని, పలువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగతనంలో కేసులో రూ.5వేలు, 11 వ్యవసాయ మోటర్ల దొంగతనాలు, మెట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒ మోటర్ సైకిల్ దొంగతనాలు, 3 వ్యవసాయ మోటర్లు, 8 కరెంటు మోటర్ల దొంగతనాలు, మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కాపర్ వైర్ దొంగతనం, 2 వ్యవసాయ మోటర్ల దొంగతనం, 10 కరెంటు మోటర్ల దొంగతనం, కథలాపూర్ పోలీస్టేషన్ పరిధిలో 1 వ్యవసాయ మోటర్, 1 కరెంటు మోటర్ దొంగతనం చేశారని తెలిపారు. నిందితుల వద్ద నుండి 1 బైక్, 30 కిలోల కాపర్వైర్, 30 వ్యవసాయ మోటర్లు, రూ.5 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేధించిన మెట్పల్లి డిఎస్పీ రాములు, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు అనిల్, కిరణ్ కుమార్, రాజు, సిబ్బంది చైతన్య, కిరణ్, సాధు నాయక్, మారుతిలను ఎస్పీ అభినందించారు

# ఎమ్మెల్సీ పోలింగ్ విధులపై సంపూర్ణ అవగాహన ఉండాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని నోడల్ అధికారులకు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో శనివారం మొదటి విడుత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానం గా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందని తెలిపారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు కొంత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి టోకెన్ నెంబర్లు అందించి ఓటింగ్ చేయించాలని ఆదేశించారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 8.00 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్టు అనుగుణంగా మెటీరియల్ అంతా ఉందా? లేదా సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల లోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారుల దేనని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీఓలు తమ పర్యవేక్షణలో ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పీఓలదేనని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జనాభా ప్రకారమే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

**మొదటి పేజీ తరువాయి...** పంపించిన బీఆర్ఎస్ కార్యకర్త లక్కినేని సురేందర్ ను ఖమ్మం జైలులో శనివారం నాడు ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కేసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, కానీ కెసిఆర్ ని, కెసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా తమను ఆపలేరని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలన్ని, మోసాలన్నీ ప్రజల మనసుల్లోకి వెళ్లిపోయాయని, రైతులు, విద్యార్థులు, మహిళలతో పాటు అన్ని వర్గాలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నాయని తెలిపారు. 14 నెలల పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని అందరికీ తెలిసిపోయిందని, ఆ భయంతోనే ఎవరిని పడితే వాళ్లను కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని చెప్పారు. గ్రామ సభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సురేందర్ పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారని, ప్రభుత్వం నడపడం చేతగాక, పథకాలు అందించడం చేతకాక వైఫల్యాలను కప్పిపెట్టుకుంటామంటే కుదరదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంట పడుతూనే ఉంటామ, అక్రమ కేసులకు తలొగ్గేదే లేదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ...

**మొదటి పేజీ తరువాయి...** అవకాశాలు కల్పించారన్నారు. విద్యారంగ సమస్యలే కాకుండా పట్టభద్రుల సమస్యలను తెలిసిన నరేందర్ రెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ అండదండలతో పట్టభద్రుల సమస్యలను తీర్చగలుగుతారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నరేందర్ రెడ్డిని గెలుపించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపైననే ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి గుర్తుచేశారు. పట్టభద్రులు విజ్ఞతను ప్రదర్శించాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విషయంలో పట్టభద్రులు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ కోరారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన విషయాన్ని పట్టభద్రులు గుర్తించుకోవాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనపై నిరంతరం శ్రమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాల్సిన బాధ్యత విద్యావంతులైన నిరుద్యోగులు, పట్టభద్రులపైన ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి ఎన్నో మంచి పనులు చేసిందని, రెండు లక్షల రుణ మాఫీని 90శాతం మందికి వర్తింపజేసిందని,వివిధ సాంకేతిక కారణాలతో 2లక్షల రుణమాఫీ పొందని పదిశాతం మందితో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యే కవ్వంపల్లి దుయ్యబట్టారు.

**గెలుపు కోసం కసిగా పని చేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టి.జీవన్ రెడ్డిని గెలిపించుకున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గుర్తు చేశారు. అప్పుడే ఎమ్మెల్సీని గెలిపించుకున్న మనం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నవేళ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవడం కష్టమా అని ఆయన ప్రశ్నించారు.

**కులమతాల పేరిట ఓట్లకు గాలం**

ఎన్నికల సమయంలో కులమతాల పేరుతో ఓట్లు దండుకునేందుకు కొన్ని పార్టీలు, కొన్ని శక్తులు కుట్రపన్నుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. ఇలాంటి తరుణంలో మరింత అప్రమత్తతో వ్యవహరిస్తూ కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఓ పట్టభద్రుల ఎమెల్సీ అభ్యర్థి దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నారని, పట్టభద్రులు, మేధావులు ఆలోచించాలన్నారు. కుల,మతాల పేరిట ఓట్లు అడగటం సహేతుకం కాదని, కుల మతాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్భుతంగా పాలన సాగిస్తున్నారని, ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 55వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మరింత మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు వీలుగా మెగా డీఎస్సీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నదని ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ అభివృద్ధికి, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు. సామాజిక మాధ్యమాల్లో తనపై తప్పుడు ప్రచారాలు చేయించ డానికి ప్రత్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఎదుగుతున్న వ్యక్తిని లాగేయాలనే ప్రయత్నంలో భాగమే ఈ తప్పుడు ప్రచారాలని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రులు వాస్తవాలు గ్రహించి విజ్ఞతను ప్రదర్శించాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నరేందర్ రెడ్డి పట్టభద్రులను కోరారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి (తిమ్మాపూర్), నందగిరి రవీంద్రచారి (మానకొండూర్), గోపగోని బస్వాగౌడ్, ముస్కు ఉపేందర్ రెడ్డి (గన్నేరువరం), ముక్కిస రత్నాకర్ రెడ్డి (బెజ్జంకి), బి.రాఘవరెడ్డి (ఇల్లంతకుంట), మార్కెట్ కమిటీ చైర్మన్లు పులి కృష్ణ (బెజ్జంకి), మర్రి ఓదెలు యాదవ్ (మానకొండూర్), ఐరెడ్డి చైతన్య-మహేందర్ రెడ్డి (ఇల్లంతకుంట), నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అట్ల అనిల్ కుమార్, మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కవ్వ పద్మ, అల్గునూరు డివిజన్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** జిల్లాలోని అర్హత ఉన్న నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవో ఏంపీఓ ఏఈ, డిఈ పంచాయతీ సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల క్రింద ఇల్లు నిర్మించుకునే ప్రతి ఇంటికి 100 శాతం సబ్సిడీ క్రింద ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరించబడిన వాటిని ఇందిరమ్మ యాప్ ద్వారా లబ్ధిదారుడి వివరాలు సేకరించబడ్డాయి. గత నెల గ్రామసభలో ప్రచురితం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల 26 వ తేదీన పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయబడిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు మంజూరు చేశామని, మంజూరు చేయబడిన ఇండ్లకు అర్హత గల లబ్ధిదారులందరికీ ఇంటి నిర్మాణం ప్రారంభించడం కోసం చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను కోరారు. ఒక్కొక్క ఇల్లు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో తక్కువ కాకుండా ఆర్సిసి కప్పుతో ,పడకగది ,హాల్ కిచెన్ టాయిలెట్స్ ,వంటి సౌకర్యాలతో నిర్మించాలని తెలిపారు. ఇంటి నిర్మాణం నమూనా ప్రకారం కలిగి ఉండాలి. సకాలంలో పూర్తి చేయడం కోసం మే..., నిర్మాణ కూలీలకు అవగాహన కల్పించాలన్నారు.



ఇంటి నిర్మాణం లబ్ధిదారుల సర్వే లో సూచించిన స్థలంలోని మార్క్ అవుట్ ఇవ్వాలని తెలిపారు. దశలవారీగా లబ్ధిదారులకు చెల్లింపు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుంది తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఇటువంటి అవంతరాలకు తావు లేకుండా పక్కాగా నిర్మాణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో, అదనపు కలెక్టర్ బి.గౌతమ్ రెడ్డి డి హౌసింగ్ డి ఈ, ప్రసాద్, ఆర్ డి రఘు వరుణ్ ఎంపీడీవోలు , ఎంపీఓలు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** జగిత్యాల పట్టణంలోని 11 కెవి ఫీడర్ లో మరమ్మత్తుల దృష్ట్యా ఆదివారం పట్టణంలోని అంగడిబజార్, యావర్ రోడ్డు, మార్కెట్బ్యాక్ సైడ్ ఏరియా, కృష్ణానగర్, అర్వింద్ నగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, టాకా సంధిల్లో ఉదయం 10 గంటల నుండి 11.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఊ ఈ ఈ ఆపరేషన్ గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం టిఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్సుందర్ ఉపాధ్యక్షుడు డా.టి.శ్రీనివాస్ లు జిల్లా విద్యాధికారి కె. రాముకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలగణన సర్వేలో సెలవుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని, గత వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు వేతనం కూడిన సెలవులు మంజూరు చేయాలని, ఎన్నికల విధులు సీనియార్టీ ప్రకారం కేటాయించాలని, 6 నెలల లోపు రిటైర్మెంట్ అయ్యేవారికి, గర్భిణీలకు, దీర్ఘకాలిక రోగులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

## సబ్ జూనియర్స్ బేస్ బాల్ ఎంపిక పోటీలు

**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** జగిత్యాల జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17 సోమవారం ప్రజ్ఞ హైస్కూల్లో సబ్ జూనియర్స్బాయి బేస్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్ నాథ్ రెడ్డి, కొప్పుల గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సోమవారం ఉదయం 10 గంటల లోపు ఆధార్కార్డు, క్రీడాదుస్తులతో హాజరు కావాలని, క్రీడాకారులు వయస్సు 01-01-2010 నుండి 31-12-2012 మధ్యలో ఉండాలని, మరిన్ని వివరాలకు 7306224589 నంబర్ను సంప్రదించాలని కోరారు.

## బిఎంఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక





**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** జగిత్యాల జిల్లా భారతీయ మజ్దూర్ సంఘ కార్యవర్గ సమావేశాన్ని మేరు సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘటన కార్యదర్శి జె.రామ్మోహన్, జాతీయ కార్యవర్గ సభ్యులు సుధీర్, భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎద్దులాపురం సత్యనారాయణ, జిల్లా బిడి కార్మిక సంఘ కార్యదర్శి శ్రీనివాస్ లు హాజరై జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించారు. జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యదర్శిగా నక్క అశోక్, ఉపాధ్యక్షులుగా కొండవత్తిని గంగాధర్, జగన్,పడకంటి శారద, సహాయ కార్యదర్శులుగా మేకల యాదగిరి, నల్లూరి రమేష్, ధరూర్ అరుణ్, వేణు, కోశాధికారి విజయేందర్ రెడ్డిలను నియమించారు.

## ఆపదలో ఆదుకున్న ఆప్తమిత్రులు

**-మృతుని కుటుంబానికి 40 వేలు అందజేసిన క్లాస్మేంట్లు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 15 :** అలనాడు అందరితో కలిసి 1992-93లో చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కి అలనాటి మిత్రులు తమ వంతుగా ఆదుకున్నారు. వివరాలకు వెళ్తే కమాన్ పూర్ మండలం కేంద్రానికి చెందిన గుంజపడుగు చిన్న రవి గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మిత్రులు ఆ కుటుంబానికి అండగా ఉండి 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. అందజేసిన వారిలో కొంత సత్యం కోలేటి చంద్రశేఖర్ తాటిపల్లి శ్రీనివాస్ మేడ తిరుపతి సాగి ప్రకాష్ గడ్డం శ్రీనివాస్ జంగిపల్లి లక్ష్మణ్ కాజీపేట వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలి



**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఫిబ్రవరి 15 :** మెట్ పల్లి మున్సిపల్ పరిధిలో ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలని మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ అన్నారు. శనివారం పట్టణంలోని పలువార్డుల్లో జరుగుతున్న పన్నుల వసూళ్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ టి.మోహన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇంటి పన్నులను, నల్లా బిల్లులను, ట్రేడ్ లైసెన్సుల బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు. పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని, ఇప్పటి వరకు పట్టణంలో 65 శాతం పన్నులను వసూలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ అక్షయ్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, విజయ్, ముజీబ్, లంక లక్ష్మణ్, నవీన్, జ్యోతి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునఃనిర్మాణానికి విరాళం అందజేత



**చురకలు విలేకరి, మెట్పల్లి, ఫిబ్రవరి 15 :** మెట్ పల్లి పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయ పునఃనిర్మాణానికి పట్టణ పద్మశాలి సంఘ సహాయ కార్యదర్శి నడికట్ల సత్యనారాయణ తన వంతుగా రూ.50116 విరాళాన్ని శనివారం పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాంకు అందించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ శ్రీశివభక్త మార్కండేయ ఆలయ పునఃనిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకు ఆనంద్, అన్నం నాగరాజు, గుంటుక గౌతమ్,భీమనాతి సత్యనారాయణ, భాస్కర్, ప్రసాద్, గణేష్, నరేష, శివానంద్, హన్మాండ్లు, సతీష్, చిన్నయయ, సాయి, రమణ, శ్యామ్, గంగారాం, వివేకానంద్, వాసాల బాలరాజ్, శ్రీనివాస్, రవీందర్, సుధాకర్, రమేష్, రుద్రయ్య, నరేందర్, లింబాద్రి, గంగాధర్, శంకర్, ధనుంజయ్, ద్విజేంద్రనాథ్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ మరమ్మత్తులను పర్యవేక్షించిన ఎస్ఈ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 15 :** జగిత్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డు 33/11 కెవి సబ్స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మత్తు పనులను శనివారం టిజి ఎన్పిడిసిఎల్ సాలియా నాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు సబ్స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మత్తు పనులను ఏలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి మరమ్మత్తులను పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల టౌన్ ఏడిఈ, విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 15 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలలో తండ పెద్దమనుషుల సమక్షంలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గారి జయంతిని పురస్కరించుకొని జగదంబ ఆలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు . గిరిజన ఆరాధ్య దేవుడైన శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనులు ఇచ్చిన ఆలోచన విధానాలను కొనియాడారు . గిరిజనులను గోర్ బంజారాలను నీటి ప్రభాకర్ ప్రభావిత ప్రాంతాలలో నివసించాలని సూచించడం జరిగింది. అంతేకాకుండా పశువు సంపదను పెంచాలని కోరడం జరిగింది. మద్యం మాంసాలను గిరిజనులు లోను కావద్దని కోరడం జరిగిందని గిరిజన నాయకులు పేర్కొన్నారు. తదనంతరం భోజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది గుండారంలో మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ భాస్కర్ నాయక్ రాజు నాయక్ బాబురావు నాయక్ మున్సింగ్ నాయక్ తండా పెద్దమనుషులు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సక్కారం నాయక్ మాలోత్ సూర్య నాయక్, హరిదాస్ నాయక్ , అజ్మీర రాజు నాయక్ మూడవ బాలు నాయక్ భూక్య శ్రీను, అజ్మీరా బోజ్యా నాయక్ తిరుపతి నాయక్ , రెడ్డి నాయక్,రవినాయక్ , రామ్ చందర్ నాయక్, అక్క పెల్లి బుగ్గ రాజేశ్వర తండాలో తిరుపతి నాయక్ మోహన్ నాయక్ రవి నాయక్ గణేష్ నాయక్, తదితరులు పాల్గొని సేవలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అండ

**-భవిష్యత్తులో అన్ని విధాలుగా అండగా ఉంటా**

**- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 15 : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రైవేట్ కంపెనీ తరఫున వ్యాపార టూర్ కోసం బ్యాంకాక్ వెళ్లిన హుజురాబాద్ మండలం చేల్పూర్ గ్రామానికి చెందిన పుల్ల సృజన్ అక్కడ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అతను ప్రస్తుతం బ్యాంకాక్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఈ విషయాన్ని తెలుసుకున్న సృజన్ భార్య స్నేహ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కలుసుకుని భర్తను స్వదేశానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యుల ఆవేదనను గమనించిన ఎమ్మెల్యే తక్షణమే చర్యలు ప్రారంభించారు. బ్యాంకాక్‌లోని అధికారులతో పాటు, సృజన్‌ను పంపిన ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి అతని తిరుగు ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయిస్తున్నారు.బాధితునికి న్యాయమైన హక్కులు బ్యాంకాక్ పంపిన కంపెనీ సృజన్‌కు లభించాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను అందించాల్సిందే అని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. అతని వైద్య ఖర్చులపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి, కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.కౌశిక్ రెడ్డికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు కౌశిక్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం పట్ల సృజన్ కుటుంబ సభ్యులు తనకు కృతజ్ఞతలు తెలిపారు. “బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు,” అని మాచనపల్లి మాజీ సర్పంచ్ పర్లపల్లి రమేష్ పేర్కొన్నారు.మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనం స్వదేశం వదలి విదేశాల్లో చిక్కుకుపోయిన బాధితుడికి సహాయం చేయడం ద్వారా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన సేవా తత్వాన్ని మరోసారి చాటారు. ఆయన స్పందనను నియోజకవర్గ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# ప్రధాని మోదీ కులం గురించి మాట్లాడే స్థాయి రేవంత్ రెడ్డికి ఎక్కడిది..?

**-కుల గణన ఓ బోగస్ ప్రక్రియ**

**-పట్టభద్రులు, టీచర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్కు బుద్ధి చెప్పాలి**

**-మీడియా సమావేశంలో బిజెపి రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ వ్యాఖ్యలు**




చురకలుగు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రధాని మోదీ సామాజికవర్గం గురించి మాట్లాడే స్థాయి లేదని,రేవంత్ రెడ్డికి మతి తప్పిందని అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని, అధికారంలో ఉన్నామని విర్రవీగి ఇష్టం వచ్చినట్టు మాట్లాడినోళ్ళు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని బిజెపి రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. శనివారం రోజున కరీంనగర్ లోని శుభ మంగళ కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్ లో అవాకులు, చావకులు పేలుతున్నాడన్నారు. కాంగ్రెస్ సర్కార్ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారని , అందుకే ప్రజల దృష్టిలో మరల్చడానికి రేవంత్ రెడ్డి ఇలాంటి చిల్లర కామెంట్స్ చేస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి కి ప్రధాని మోదీ కులం గురించి మాట్లాడడానికి సిగ్గు అనిపిస్తలేదా..? మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన ఓ బోగస్ ప్రక్రియ అన్నారు. హిందూ ముస్లిం , బీసీ ముస్లిం అని ప్రపంచంలో ఎక్కడైనా ఉందా..? ఈ సర్వే దేశానికి రోల్ మోడలా..? రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే లెక్కలు బోగస్ అని తేలడంతోనే మళ్లీ సర్వే కు అవకాశం ఇచ్చారన్నారు. కుల గణనపై కాంగ్రెస్ ప్రభుత్వానిక చిత్తశుద్ధి లేదన్నారు .ఉంటే.. తెలంగాణలో రెండోసారి కులగనన ఎందుకు..? ముందు దీనికి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, బీసీల పట్ల మీరు చేస్తున్న ద్రోహానికి ప్రస్తుతం బీసీలు కూడా కాంగ్రెస్ వైపు లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలనే కసి ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకోవాలని , లేకపోతే మొన్న కెసిఆర్ నిన్న కేజ్రీవాల్ కు పట్టిన గతే నీకు పడుతుందనీ ఆయన హెచ్చరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ కు గాడిద గుడ్డు ఇచ్చినా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి రావడంలేదని , రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుంటే , ప్రజలను మోసం చేసి పబ్బం గడుపు కోవాలనే కాంగ్రెస్ కు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు , టీచర్స్ తగిన బుద్ధి చెప్పాలన్నారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇట్టి సమావేశంలో బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ , జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి , మాజీ మేయర్ లు డి శంకర్, సునీల్ రావు , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట మండలంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి లేదు,,,,,,భయపడవద్దు,,,,,,



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 15 : ఎల్లారెడ్డిపేట మండలంలో కోళ్లకు బర్డ్ ఫ్లూవ్యాధి లేదని ఎవరు కూడా భయపడవద్దని ఎల్లారెడ్డిపేట వెటర్నరీ డాక్టర్ రాహుల్ తెలిపారు.ఎల్లారెడ్డిపేట మండలంలో సుమారు 15 పౌల్ట్రీ ఫామ్‌లు ఉన్నాయని అట్టి పౌల్ట్రీ ఫామ్ లకు వెళ్లి కోళ్లను పరీక్షించడం జరిగిందని అందులో ఒక్క కోడికి కూడా బర్డ్ ఫ్లూ వ్యాప్తి లేదని ఆయన ప్రకటించారు.ప్రజలునిశ్చింతంగా చికెన్ కోడిగుడ్లలను వినియోగించుకోవచ్చని ఆయన అన్నారు.ఎల్లారెడ్డిపేట మండలంలో నిర్వహిస్తున్న చికెన్ సెంటర్లకు మండలంలోని పౌల్ట్రీ ఫామ్‌ల నుండే ప్రతిరోజు సప్లై చేయబడుతున్నాయని ఆయన చెప్పారు.

# సొంత ఖర్చులతో రోడ్డు నిర్మించిన యువత



చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 15 : కరీంనగర్ జిల్లా వీణవంక మండల పరిధిలోని కొండపాక గ్రామానికి చెందిన కొంతమంది యువత సొంత డబ్బులతో కొండపాక నుండి పోతుపల్లి మానేరు వాగులో తాత్కాలిత రోడ్డు నిర్మించడం వలన మానేరు వాగును నుండి పెద్దపల్లి జిల్లాకు దూరం తగ్గుతుంది.వివిధ మండలాల ప్రజలకు చుట్టుపక్కన ఉన్న వివిధ గ్రామాల ప్రయాణికులకు ప్రయాణం చేసేటప్పుడు ఇబ్బంది కావద్దని దృష్టిలో పెట్టుకొని కొండపాక మానేరు నుండి రోడ్డు మార్గం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపల్లి రాజయ్య,కాసర్ల అనిల్ కుమార్, దాట్ల శ్రీనివాస్, కాసర్ల వీరస్వామి,కసర్ల సమ్మయ్య,కాసర్ల బుచ్చయ్య,నల్లగాషా స్వామి,రాచర్ల రాయమల్లు,గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం



చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 15 : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో రెండు సంవత్సరాల పాటు పనిచేసిన మేనేజర్ కార్తీక్ చౌదరి పంజాబ్ కు బదిలీ అవ్వడం జరిగింది.మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి గారి ఆధ్వర్యంలో మేనేజర్ కార్తీక్ చౌదరిని శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ ఇన్ని రోజులు కల్వచర్ల గ్రామంలో రైతులకు ,మహిళా సంఘాలకు ,ఇతర ప్రజలకు అందుబాటులో ఉంటూ , సహకరించిన మేనేజర్ కార్తీక్ చౌదరి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారని, ఉద్యోగంలో బదిలీలు సాధారణమైనప్పటికీ వెళ్లిన చోట ప్రజల మన్ననలు పొందడం గర్వకారణం, బదిలీపై వెళ్తున్న మీరు అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వచర్ల మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, బ్యాంకు సిబ్బంది బీఎం క్రాంతి,క్యాషియర్ శ్రీనివాస్, క్రాంతి,శేషు ఇతరులు పాల్గొన్నారు

# ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 15 :** జమాతే ఇస్లామీ హింద్, పెద్దపల్లి యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఫారాన్ కాంప్లెక్స్ లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించిందని పెద్దపల్లి అధ్యక్షులు అబ్దుల్ హై జావీద్ అన్నారు.లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు పూదరి దత్తాగౌడ్ సహకారంతో ఫార్చున్ మెడ్ కేర్ ఆసుపత్రి ,న్యూ వెల్స్ ఆసుపత్రి,శరత్ మ్యాక్సీ విజన్ వారి సౌజన్యం నిర్వహించామన్నారు. కార్డియాలజిస్ట్ (హృదయ సంబంధిత చికిత్స) విభాగంలో 152 మంది పరీక్షలు, జనరల్ మెడిసిన్ (సాధారణ ఆరోగ్య న సమస్యలు)విభాగంలో 123 మందికి ఆర్థోపెడిషియన్ (ఎముకలు & కీళ్ల సమస్యలు)విభాగంలో 52 మందికి కంటి పరీక్షలు 134 మందికి డెంటల్ సర్జన్ (పళ్లు & నోటి సంబంధిత చికిత్స) విభాగంలో 67 మందికి, పీడియాట్రీషియన్ (శిశువుల & పిల్లల ఆరోగ్య సేవలు) విభాగంలో 54 మందికి గైనకాలజిస్ట్ (మహిళల ఆరోగ్య సేవలు) విభాగంలో 72 మందికి మొత్తం సుమారు 450 మందికి పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు పాల్గొని డాక్టర్ల బృందానికి శాలువలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోపగోని సారయ్య గౌడ్,సయ్యద్ మస్రత్, మొహమ్మద్ ఖలీమొద్దీన్, జావీద్ అలీ అజ్మీ,డాక్టర్ల బృందం డా.జునైద్ పిల్లల వైద్య నిపుణులు, డా.రుహి,డా.ఫహాద్, డా.రాజ్ కుమార్, ఫార్చ్యూన్ మెడ్ కేర్ ఆసుపత్రి క్యాంపు ఇంచార్జి గజవెల్లి గణేష్ పాల్గొన్నారు.

# సామాజిక సంఘసంస్కర్త సేవాలాల్

**-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 :** సామాజిక సంఘసంస్కర్త సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని కోతి రాంపూర్ లోని చౌరస్తాలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బానోత్ శ్రవణ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం నిర్వహించిన సేవాలాల్ మహారాజు 286వ జయంతి ఉత్సవాలలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు సంచార జీవనం కాకుండా, స్థిర నివాసం ఏర్పరచుకొని అభివృద్ధిలో ముందుకు వెళ్లే విధంగా కృషిచేసిన మహనీయుడని అన్నారు మూఢనమ్మకాలను సామాజిక రుగ్మతలను రూపుమాపాలని కృషిచేసిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని తెలిపారు వ్యవసాయం విద్యతో విజ్ఞాన సమాజంలో ముందుకెళ్లాలని మార్గదర్శనం చేసిన చైతన్య శీలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్ నాయక్, ప్రేమ్ నాయక్,రాజ్ కోటి, జేరిపోతుల వాసు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి
# సమావేశాన్ని బహిష్కరించిన హుస్నాబాద్ జర్నలిస్టులు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 :** పట్టభద్రుల బలం... గలం ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి రెడ్డి గెలుపు లక్ష్యంగా శనివారం హుస్నాబాద్ పట్టణం తిరుమల గార్డెన్ లో ఏర్పాటుచేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం లో అసలు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహిస్తున్నారా? లేక యూత్ కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్నారా? అర్థం కానీ పరిస్థితి నెలకొంది. కార్యక్రమానికి వెళ్లిన విలేకరులకు కనీస సమాచారం లేదు. పోగా వెళ్లిన విలేకరులకు కూర్చోవడానికి కుర్చీలు లేకుండా నిలబెట్టడంతో సమావేశాన్ని బహిష్కరించిన జర్నలిస్టులు.ఆత్మీయ సమ్మేళనమని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి సమావేశంలో సమయ పాలన పాటించకుండా రెండు గంటల ఆలస్యంగా సభ ప్రారంభమైనప్పటికీ సహనంతో వేచి ఉన్న జర్నలిస్టుల యొక్క మనోభావాలను దెబ్బతీస్తూ వారికి కనీసమైన విలువ ఇవ్వకుండా ప్రవర్తించిన తీరుతో జర్నలిస్టులు ఒకింత అసహనానికి గురై సమావేశాన్ని బహిష్కరించడం జరిగినది.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పాలకుర్తి) ఫిబ్రవరి 15 :** భామ్లానాయక్ తండా గ్రామపంచాయతీలో శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు.దేశ వ్యాప్తంగా 16 కోట్ల మంది ఒకే బాషా మాట్లాడే వారు గిరిజనులు వున్నారు. భారతదేశ గర్వించ దగ్గ గొప్ప ఆధాత్మిక సేవాలాల్ మహారాజ్ అయినా చేసిన సేవలు మారవువారానిది. తేదీ ఫిబ్రవరి 15 శనివారం రోజున మాజీ సర్పంచ్ బాధవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో భోగ్ బండరో కార్యక్రమం అంగరంగ వైభవంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేశోరం సిమెంట్ ఫ్యాక్టరీ పర్మనెంట్ అధ్యక్షులు భయపు మనోహర్ రెడ్డి భామ్లానాయక్ తండా మాజీ ఉప నాయక్ సబ్ బాధవత్ సారయ్య తండా కారోబార్ ఇస్లావత్ సమ్మయ్య మరియు తండా మాజీ సర్పంచ్ లాల్ సింగ్ మాజీ ఉపసర్పంచ్ తిరుపతి నాయక్ మాజీ వార్డ్ సభ్యులు బైక్య రాజు నాయక్ ఇస్లావ తిరుపతి నాయక్ తండా పెద్దమనిషి వస్రామ్ నాయక్ బానోత్ కొట్లీయా తిరుపతి జిల్లు మూడు రమేష్ బాధవత్ జంకిలాల్ మూడ్ శివ కుమార్ నాయక్ భూక్యా తిరుపతి బాదాత్ శ్రీరామ్ బాల్య నాయక్ బాధవత్ జయపాల్ నాయక్ బాధవత్ రామ నాయక్ గ్రామ పెద్ద మనుషులు గ్రామ యువకులు గ్రామ కార్యదర్శి అనిల్ సార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## యాదవులను కుల గణన చేసి తక్కువగా చూపడం సరికాదు



**చురకలు ప్రతినిధి,హనుమకొండ ఫిబ్రవరి 15 :** తెలంగాణ ప్రభుత్వం యాదవుల కుల గణన చేయడంలో విఫలమైందనీ తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కోరే రవి యాదవ్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రం లో కుల గణన చేసినట్లు కుల సంఘాల లెక్కలు తెలిపారు అందులో యాదవుల కుల గణన చేసి తక్కువ గా చూపెట్టడాన్ని తెలంగాణ యాదవ్ మహా రాష్ట్ర కార్య దర్శి విచారం వ్యక్తం చేశారు బీసీ కుల గణన పేరుతో యాదవ జనాభా ను తక్కువ గా చూపెట్టడం పై ప్రభుత్వ కుట్రలు దాగివున్నాయి కుల గణన తక్కువ గా చూపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయం గా యాదవులను అణిచి వేయాలని చూస్తున్నట్లు రవి యాదవ్ అనుమానం వ్యక్తం చేశారు ఇప్పటికైనా యాదవ కుల గణన సరిగా చేసి జనాభా లెక్కల ప్రకారం సీట్లు కేటాయించాలని రవి యాదవ్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ములుగు జిల్లా అధ్యక్షులు మాదం సాగర్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యాదవ జనాభా తక్కువ గా చూపెట్టే కుట్రలు మానుకోవాలని సూచించారు ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు గొర్రె శ్రీనివాస్ యాదవ్ టౌన్ అధ్యక్షులు బైకాని విష్ణు యాదవ్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి గట్టయ్య బుచ్చన్న యాదవ్ సమ్మన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 20న ఆర్టిజన్ కార్మికులు విద్యుత్ సౌద ముట్టడి

**-విజయవంతం చేయాలని పిలుపు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 15 :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయ పరమైన హక్కుల సాధన కోసం ఈనెల 20న తెలంగాణ విద్యుత్ సౌధ ముట్టడికి పిలుపునిచినట్లు పెద్దపల్లి జిల్లా ఆర్టిజన్ జె ఏ సీ నాయకులు తెలిపారు. ఈమేరకు శనివారం పెద్దపల్లి ఎస్ ఈ కార్యాలయం వద్ద ముట్టడి పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా నుండి ఆర్టిజన్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంల టీవీఏసీ జె ఏ సి పెద్దపల్లి చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, కో చైర్మన్ ఎల్లయ్య, వై. రమేష్, బి. శ్రీనివాస్, తిరుపతి, పూసల రాజ్ కుమార్, ఈర్ల సదయ్య, దుదపాక ఓదెలు, వేణుగోపాల్, ట్రాన్స్కో రమేష్, రవి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల విగ్రహా ప్రతిష్ఠాపనకు భూమి పూజ



**చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 15 :** వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామం లో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మ విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమం లో భాగంగా శనివారం భూమి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రచరణల నడుమ పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ వచ్చే నెల 3నుంచి 6వరకు భూలక్ష్మి బొడ్రాయి కార్యక్రమాలు జరుగుతాయాని తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పాలొగొన్నారు.

# సింగరేణి కార్మికుల్లో నయా జోష్ నింపిన బలరాం నాయక్

**-కోల్ బెల్ట్ లో కార్మిక చైతన్య యాత్రకు విశేష స్పందన**

**-దశాబ్దాల చరిత్రలో చైర్మన్ నాయక్ యాత్ర మొదటిసారి**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 15 :** 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు పరిశ్రమ మనుగడ కోసం.... బొగ్గు ఉత్పత్తుల పెంపు కోసం... సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ "బలరాం నాయక్" వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులు అందరినీ ఆకర్షిస్తుంది. బొగ్గు గని కార్మికులతో మమేకమయ్యే కార్యక్రమాన్ని చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి అని చెప్పొచ్చు. బొగ్గు గని కార్మికులతో గంటలపాటు మమేకమవుతూ స్వయంగా సమస్యలు తెలుసుకోవడం... చర్చించడం... సంస్థ మనుగడలో వారిని భాగస్వామ్యం చేసే కార్యక్రమం చేపట్టడం బలరాముడికే దక్కింది. లక్ష్యాలను అధిగమించడమే "నాయక్ "లక్ష్యంగా పెట్టుకున్నాడు.నేరుగా కార్మికులతో ఇంట్రాక్ట్ ప్రోగ్రాం పైనే ఎక్కువ దృష్టి పెట్టాడు. సింగరేణి బొగ్గు పరిశ్రమలో బలరాం నాయక్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నుండే వినూత్న రీతిలో ముందుకు సాగుతున్నాడు. ప్రస్తుతం సింగరేణి కంపెనీకి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియామకమైన తర్వాత మరింత జోష్ గా దూసుకుపోతున్నాడు.లక్ష్యాలను అధిగమించేందుకు సింగరేణి చైర్మన్ బలరాముడు విన్నూత్న ఆలోచనలను శభాష్ అంటున్నారు. సరికొత్త విధంగా సింగరేణి కంపెనీలో చైర్మన్ బలరాం నాయక్ కార్యచరణను అందరూ హర్షిస్తున్నారు. ఉత్పత్తులను పెంచడం కోసం ఇటీవలనే సింగరేణి వ్యాప్తంగా కార్మికులతో బొగ్గు గనులపై వనభోజ నాల జాతరను నిర్వహించారు.అది జీఎం స్థాయి అధికారులు కార్మికులతో మమేకమవుతూ వనభోజనాలు చేపట్టారు. ఇప్పుడు ఏకంగా కార్మికుల తో మమేకం అయ్యేందుకు సింగరేణి చైర్మన్ బలరాం నాయక్ రంగంలోకి దిగారు. సింగరేణి వ్యాప్తంగా కార్మిక చైతన్య యాత్ర పేరిట సింగరేణి చైర్మన్ బలరాం నాయక్ బొగ్గు పరిశ్రమ పరిధిలోని అన్ని డివిజన్లను సందర్శిస్తు న్నారు. గని కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. బొగ్గు గనులు,ఓపెన్ కాస్ట్ లలో పని ప్రదేశాలను స్వయంగా పరిశీలిస్తున్నారు. స్వయంగా చైర్మన్ బలరాం నాయక్ కార్మికుల నుండి వివరాలను సేకరిస్తున్నారు. ఇటీవల సింగరేణిలో వందలాది మంది యువత కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందారు.వీరిలో మహిళలు కూడా వందల సంఖ్యలోనే ఉన్నారు. మహిళా కార్మికులతో కూడా చైర్మన్ బలరాం నాయక్ గంటలపాటు మాట్లాడారు. మహిళ కార్మికులకు పరిపూర్ణ భద్రత, భరోసా ఉంటుంద న్నారు. భవిష్యత్తులో పరిశ్రమ భవిష్యత్తును వివరించడం తోపాటు బాధ్యతగా విధులు నిర్వహిస్తే మనకు కలిగే ఉజ్వల భవిష్యత్తును కూడా కార్మికులకు ఎంతో ఓర్పుగా చైర్మన్ హిత బోధన చేయడం యువ కార్మికులను ఆలోచింపజేసిందని చెప్పచ్చు. సింగరేణి వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో అధికారులు అలసత్వంగా వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొంటూ అలాంటి అధికారుల్లో పూర్తిస్థాయి మార్పు రావాలని చైర్మన్ కరాకండిగా చెప్పారు. విధులకు గైర్హాజరైతే కార్మికులే కాదు అధికారులను కూడా విడిచి పెట్టేది లేదని తేల్చి చెప్పడం చైర్మన్ మాటల్లో పారదర్శకత కనిపించింది.అధికారులు వేరు, కార్మికులు వేరనే తారతమ్యాలు ఉండవని ,ఉండరాదని అన్నారు. కార్మికుల సంక్షేమానికి ఎప్పుడూ డోకా లేదని... బొగ్గు ఉత్పత్తుల్లో సింగరేణి పరిశ్రమ దేశంలోనే ఆదర్శంగా నిల వాలని చైర్మన్ నాయక్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గడిచిన నాలుగు రోజులుగా సింగరేణి వ్యాప్తంగా చైర్మన్ బలరాం నాయక్ నిర్వహిస్తున్న కార్మిక చైతన్య యాత్రకు విశేష స్పందన లభి స్తుంది. కార్మిక చైతన్య యాత్ర పేరిట కోల్ బెల్ట్ ఏరియాలోని శ్రీరాంపూర్, మందమరి,బెల్లంపల్లి, రామగుండం రీజియన్లు, భూపాలపల్లి ఏరియా ప్రాంతాల్లోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు, ఆయా డివిజన్లోని డిపార్ట్మెంట్లను సైతం చైర్మన్ విస్తృతంగా సందర్శించారు.గతంతో పోల్చుకుంటే అప్పటి పరిస్థితులు వేరు...బొగ్గు గని కార్మికులతో నేరుగా మాట్లాడాలంటే మేనేజర్, ఏజెంట్, జీఎం స్థాయి అధికారి మాట్లాడటమే కష్టమైన పరిస్థితి. ఇప్పుడు పరిస్థితులు చాలా వరకు మారాయి అని చెప్పొచ్చు. యువ కిరీటాలు సింగరేణి బొగ్గు పరిశ్రమలో ఉన్నత అధికారులుగా వ్యవహరించడం తో చాలావరకు మార్పులు వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఏకంగా చైర్మన్ కార్మికులను కలవడం, వివరాలను సేకరించడం కొత్తగా అనిపించిన కార్మిక వర్గాల్లో ఒక కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. బొగ్గు ఉత్పత్తులను పెంచడంతోపాటు కార్మికుల సమస్యలను కూడా తెలుసుకుంటూ పరిష్కార మార్గాన్ని వెంటనే చెప్పడంతో ఇప్పటివరకు కార్మికుల్లో సింగరేణి పరిశ్రమపై.... ఉన్నత అధికారులపై ఉన్న అభిప్రాయం వారి కార్మికుల్లో పాజిటివ్ ఆలోచన కనిపిస్తుంది. బొగ్గు గనులపై కార్మి కులతో కలిసి అల్పాహారం చేయడం, అందరితో కలిసి భోజనాలు చేయడం సరికొత్త వాతావరణం కనిపించింది. సింగరేణి చైర్మన్ నాయక్ విన్నత్న ఆలోచనలు "యువ కార్మికుల్లో జోష్" నింపినట్లు కనిపిస్తుంది. బ్రతుకునిచ్చిన పరిశ్రమను కాపాడుకుంటూ... మనపై ఆధారపడ్డ కుటుంబాలకు ఎప్పుడు ధైర్యంగా ఉండాలంటే విధులకు గైర్హాజరు కాకుండా పనిగంటలను పరిపూర్ణంగా వినియోగించుకుంటూ ... వ్యసనాలకు బానిస కాకుండా సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని చైర్మన్ నాయక్ వివరించిన విధానం కార్మికులను ఎంతో ఆలోచింపజేసింది. రక్షణ, నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని , కార్మికులు బాగుంటేనే పరిశ్రమ బావుంటుందని, తల్లి లాంటి సింగరేణి బొగ్గు పరిశ్రమను కాపాడుకోవడం కోసం అందరం ఐక్యంగా పనిచేద్దామని చైర్మన్ బలరాం పిలుపుతో గని కార్మికుల్లో సరికొత్త ఆలోచన వచ్చింది.

# యువత చేతిలోనే దేశ భవిష్యత్తు...

**-ట్రినిటీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి**

**-ట్రినిటీ లో ఘనంగా పట్టాబధ్రుల దినోత్సవం**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి) ఫిబ్రవరి 15 :** దేశ భవిష్యత్తు పురోగతి అంతా యువత చేతిలోనే ఉందని ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు జిల్లా కేంద్రం పెద్దపెల్లి లో స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన పట్టాభద్రుల దినోత్సవానికి ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి దాసరి ప్రశాంత్ రెడ్డి ,జేఎన్టీయూ కళాశాల హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగ అధిపతి, ఆచార్య డాక్టర్ ఉమా రాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు విద్యార్థులు సమర్ధవంతమైన సూచనలు సలహాలు అందించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువత దేశం కోసం పనిచేయాలన్నారు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా చేతికి అందడంతో ఎవరికి వారే మార్గదర్శకు లుగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు, భవిష్యత్తులో అవకాశాలు మరింత మెరుగుపడతాయని వాటిని పూర్తిస్థాయిలో అందుపుచ్చు కోవాల న్నారు, ఏ ఏ పని చేసిన సమర్థత కీలకమని నొక్కి చెప్పారు మీలాంటి యువత నాయకత్వం వహించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు ఉన్నత కళలు కానీ వాటిని సహకారం చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఉద్బోధించారు, ఉద్యోగం బతుకుదెరువు కె అన్నట్టుగా కాకుండా పూర్తి సంతృప్తితో బాధ్యతతో నిర్వహిస్తే మంచి గుర్తింపు లభిస్తుంద న్నారు, డిగ్రీలు సాధించిన విద్యార్థులు సహకారాత్మక కృషి కోణంలో ముందుకు సాగాలన్నారు, వ్యక్తిగత కుటుంబ ఉద్యోగ బాధ్యతలను విస్మరించకూడదని హితవు పలికారు, జీవితం పరుగు పందెం లాంటిదని పడి లేచే కెరటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు వెండి పథకాలు డిగ్రీ పట్టాలు ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ ఈవో సురేష్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ,డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరిఫ్, స్వాతి, ప్రభాకర్, డాక్టర్ రామ్మోహన్ , డాక్టర్ అంబికా తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మగాని ధర్మభిక్షం పోరాటం, త్యాగం మరువలేనిది

**-కొయ్యడ సృజన్ కుమార్**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం త్యాగం మరువలేదని గీతపనివారల సంఘం జిల్లా నిర్మాణ భాద్యులు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు.శనివారం రోజున ధర్మభిక్షం 103 వ జయంతిని పురస్కరించుకొని స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ ధర్మభిక్షం గారు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం నిస్వార్థంగా ఉద్యమించిన మహా నాయకుడని అన్నారు. నిజాం రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఇచ్చిన తెలంగాణ సాయుధ పోరాట పిలుపును అందుకొనిసాయుధ పోరాటంలో ప్రత్యేక్షంగా పాల్గొని వందలాది గ్రామాలను విముక్తి చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారని, దున్నే వాడికి భూమి కావాలని వేలాది ఎకరాలను పేదలకు భూములు పంచారని,స్వార్థం లేకుండా నిస్వార్ధంగా తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నిడన ప్రజా పోరాటాలు నిర్వహించారని,నల్లగొండ నుండి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులు ఎదురుకొంటున్న సమస్యల పరిష్కారం కోసం గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి సమగ్ర కల్లు గీత విధానం కోసం, కార్మికుల శ్రేయస్సు కోసం,ప్రమాద వశత్తు చెట్టు పైనుండి పడి మరణించిన గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని అనేక పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించడంలో ముందున్నారని, గౌడ జాతికి ధర్మభిక్షం ఆదర్శప్రాయుడని కొనియాడారు. ధర్మభిక్షం గారి ఆశయాల సాధన కోసం హక్కుల రక్షణ కోసం పోరాటలు చేయాలని సృజన్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు గౌడ్, బోయిని తిరుపతి, కిన్నెర మల్లమ్మ, బోనగిరి మహేందర్, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ నాయకులు సాంబయ్య, అంజిరెడ్డి, మల్లేశం,లక్ష్మి పాల్గొన్నారు.

## మార్నింగ్ వాక్‌తో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రచారం

**-కులమతాలకు అతీతంగా సేవ చేసే వ్యక్తిని**

**విద్యా సంస్థల అధినేతగా ఎంతో మందిని విద్యావంతులుగా ఉద్యోగులుగా తీర్చిదిద్దాను**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 :** ఓటమి భయంతోనే కొందరు కుల రాజకీయాలతో పాటు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విమర్శించారు. విద్యాసంస్థల అధినేతగా ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దానని ప్రజాసేవకై రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి కరీంనగర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ తో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా తాను సేవ చేస్తున్నానని తెలిపారు. సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుష్ప్రచారం చేసే వాళ్ళు ప్రజలకు ఏం సేవ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క పేద విద్యార్థిని చదివించారా?... నిరుద్యోగికి ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే కుల రాజకీయాలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని పట్టభద్రులను కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీ గా ఆశీర్వదించాలని నరేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి టీసీఎస్ఎస్టియుఎస్ సంపూర్ణ మద్దతు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 :** కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుల ఎం.ఎల్.సి గా పోటీ చేస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత శ్రీ వుట్కూరి నరేందర్ రెడ్డి గారికి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలంగాణ ఎస్.సి, ఎస్.టి ఉపాధ్యాయ సంఘం తెలియజేసింది. తెలంగాణ ఎస్.సి, ఎస్.టి మరియు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ శ్రీ నరేందర్ రెడ్డి గారు రాష్ట్రంలో ఉన్న SC, ST బ్యాక్ లాగ్ పోస్టులను వారి జనాభా ఆధారం గా SC లకు 18 శాతం రిజర్వేషన్ పెంపునకు కృషి చేసి భర్తీ చేయిస్తానని, ST లకు 10 శాతం ఉండేటట్లు బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయిస్తానని, SC, ST నిరుద్యోగ యువకులకు వారి అర్హతలకు అనుగుణంగా ప్రతి పాత జిల్లా కేంద్రాలలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు వచ్చేవరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకునేటట్లు కృషిచేస్తానని ఇచ్చిన హామి మేరకు వారికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నా అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిమల్ల చిట్టిబాబు గారు మాట్లాడుతూ నరేందర్ రెడ్డి గారు తన ఎం.ఎల్.సి నిధులను ఎస్.సి, ఎస్.టి వర్గాల అభివృద్ధి కోసం కూడా ఖర్చు చేస్తానని ఇచ్చిన హామి హర్షనీయమని వారికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు.సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్ గారు మాట్లాడుతూ నరేందర్ రెడ్డి గారి విద్యాసంస్థలలో ఎంతో మంది ఎస్.సి, ఎస్.టి విద్యార్థులు అత్యున్నత విద్యను అభ్యసించి ఉన్నతంగా స్థిరపడ్డారన్నారు. ఒక విద్యావేత్త చట్ట సభలలో ఉంటే శుభసూచకమన్నారు.కావున ఎస్.సి, ఎస్.టి వర్గాల ఉద్యోగులు, పట్టభద్రులు శ్రీ వుట్కూరి నరేందర్ రెడ్డి గారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నిర్ణయించుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్.సి, ఎస్.టి ఉపాధ్యాయ సంఘం సభ్యులు జి. శంకర్, బి. రాజు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

**-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 15 :** ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు.కరీంనగర్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వాణీనికేతన్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ధన్గర్వాడి ఉన్నత పాఠశాల, గంగాధర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబోయే గదులను, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ సంఖ్యను ఓటర్లకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో వెలుతురు ఉండేలా చూడాలన్నారు. దివ్యాంగ ఓటర్లకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో తన ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మార్వోలను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓ మహేశ్వర్, తహసీల్దార్లు నరేందర్, అనుపమ, ఎంపీడీవో రాము, ఆర్ఐ లు శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



# అర్చకులు రంగరాజన్ పై దాడి హేయమైన చర్య

**-మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్**



**చురకలు విలేఖరి,హుజురాబాద్, ఫిబ్రవరి, 15 :** చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ మీద దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపించాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లాల మస్జిద్ ఈద్గా ఖబ్రిస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిజిపి అడిషనల్ డీజీపీ డి ఏ జి పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేస్తూ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ మీద దాడి చేసిన వీర రాఘవరెడ్డి తో పాటు అతని అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ మొహమ్మద్ ముజాహిద్ చేశారు రంగరాజన్ ఇంటిపై సుమారు 20 మంది వరకు రంగరాజన్ పై దాడి కి పాల్గొంటారు.రామ రాజ్యం స్థాపన పేరుతో వీర రాఘవరెడ్డి అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంట్లోని చొరబడి హంగామా సృష్టించారు నల్ల రంగు దుస్తులు ధరించి ప్రైవేటు సైన్యాన్ని తలపించే లా వచ్చిన గుంపు చిలుకూరు బాలాజీ ఆలయం సమీపంలో ఉన్న రంగరాజన్ ఇంట్లో చొరబడ్డారు రంగరాజన్ ను క్రింద కూర్చోబెట్టి వీర రాఘవరెడ్డి అనే వ్యక్తి అనేక ప్రశ్నలు సంధిస్తూ ఏమి తెలియదని పురోహితిని రూపములో ఉన్న కపట వేషధారి అంటూ దూషించాడు తమ రామ రాజ్యం స్థాపన కోసం పోరాడుతున్నామని తమకు సహకరించాలని బెదిరించారు ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది కనుక దానిని దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ వారు వెంటనే ప్రైవేట్ సైన్యం నాయకుడు వీర రాఘవరెడ్డిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్కు పంపించాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లాల మజీద్ అండ్ ఈద్గా ఖబ్రిస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినారు ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ కు అన్ని రకాల సెక్యూరిటీ కల్పించాలని ఆయనకు భద్రత కూడా కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఈరోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంత కుమారి దేవదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖకు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు

## ఆడబిడ్డలకు ఈసారైనా

# తులం బంగారం ఇస్తారా?

**-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 15 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వనున్నదా లేదా? అని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు.శనివారం వీణవంకలోని తన స్వగృహంలో కళ్యాణ లక్ష్మి దరఖాస్తులపై సంతకాలు చేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పథకం మాత్రమే ఇప్పటికీ అమలవుతుందని స్పష్టం చేశారు."ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఒక్కరికి కూడా తులం బంగారం రాలేదు" అని ఎమ్మెల్యే మండిపడ్డారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ఇప్పటి వరకు 1,000కి పైగా కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశానని కానీ ప్రభుత్వ హామీగా వచ్చిన తులం బంగారం మాత్రం ఎవరికి రాలేదని విమర్శించారు.తక్షణమే తులం బంగారం పంపిణీ చేయాలి.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఎంతమంది వివాహాలు జరిగాయో వారి అందరికీ తులం బంగారం ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జమ్మికుంట పట్టణం ,జమ్మికుంట రూరల్, ఇల్లంతకుంట, వీణవంకకు సంబంధించిన 300కి పైగా కళ్యాణ లక్ష్మి దరఖాస్తులపై సంతకాలు చేసినట్లు తెలిపారు. "ప్రభుత్వం ఎన్ని రోజులు ప్రజలను మోసం చేస్తుంది? తులం బంగారం హామీ అమలు చేయకపోతే ప్రభుత్వం బహిరంగ వివరణ ఇవ్వాలి!" అంటూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రభుత్వ డిమాండ్ చేశారు.

## బీటెక్ పట్టభద్రులకు

# "బీఎఫ్ఎస్ఐ - స్కిల్లింగ్" కోర్సు

**-రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 15 :** గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)లో తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు.అనుకూలమైన వాతావరణం ఉండటంతో హైదరాబాద్ జీసీసీలకు హబ్ గా మారుతోందన్నారు. ప్రస్తుతం నగరంలో 355 జీసీసీలుండగా, 3 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నా రన్నారు. ప్రముఖ దిగ్గజ కంపెనీలు కొత్తగా తమ జీసీసీలను ఇక్కడ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఏర్పాటవుతున్న జీసీసీల సంఖ్య పెరుగుతుందన్నారు. బీఎఫ్ఎస్ఐ కన్సార్షియం, ఎక్విప్ సహకారంతో స్కిల్ యూనివర్సిటీ ద్వారా బీఎఫ్ఎస్ఐ జీసీసీలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులుగా తెలంగాణ యువతను తీర్చి దిద్దాలని సంకల్పించామన్నారు.

# కాటమయ్య కిట్లపై అవగాహన

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 15 :** రామగిరి పాలకుర్తి మండలాల్లోని గీత కార్మికులకు కాటమయ్య కిట్ లపై శనివారం అవగాహన కల్పించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్-మంథని మరియు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామగిరి మండలంలోని చందనాపూర్ ఎల్లమ్మ గుడి దగ్గర చందనాపూర్ జల్లారం నాగారం సింగిరెడ్డిపల్లి కన్నాల గ్రామాల గౌడ మిత్రులందరికీ కాటమయ్య రక్షణ కవచ్ కిట్టు యొక్క ఉపయోగాలు అవగాహన ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.ఇట్టి కాటమయ్య రక్షణ కవచ్ కిట్టును ఉపయోగించి గీత వృత్తిలో భాగంగా తాడిచెట్టు పైనుండి పడి శాశ్వత అంగవైకల్యం మరియు మరణించడం లాంటి ప్రమాదాలు జరగకుండా కాటమయ్య రక్షణ కవచ్ చెట్టును ఉపయోగం గురించి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.ఈ ప్రోగ్రాంలో సాయికుమార్ ఎస్సై, రాజేందర్,రఘురాం, శ్రీనివాస్ మరియు ట్రైనర్స్ పాల్గొన్నారు.